విజయవంతమైన పరిశ్రమలు, కళాశాల అనుసంధాన సదస్సు

పోచారం మున్సిపాలిటీ నారపల్లిలోని ఎన్ఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 3, 4 తేదీల్లో నిర్వహించిన పరిశ్రమలు, కళాశాల అనుసంధాన సదస్సు విజయవంతమైనట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ దివ్య నల్ల తెలిపారు. ఇంజినీరింగ్,ఎంబీఏ విద్యార్థులను పారిశ్రామిక వేత్తలుగా,బలమైన ఉద్యోగులుగా తయారు చేయడానికి పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా తీర్చిదిద్దడానికి ఈ వేదిక ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు. వివిధ పరిశ్రమల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– పోచారం, ఏప్రిల్ 4

శాంతన్‌కుమార్‌రెడ్డికి లయన్స్ క్లబ్ సన్మానం



రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన గ్రూప్ –1 ఫలితాల్లో రాచకొండ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ బీ.రవీందర్ రెడ్డి కుమారుడు శాంతన్‌కుమార్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో 30వ ర్యాంకు, మల్టీజోన్‌లో 12వ ర్యాంకు సాధించారు. దీంతో శాంతన్‌కుమార్‌రెడ్డి, అతడి తల్లిదండ్రులు గీత, ఎస్‌బీ ఏసీపీ రవీందర్‌రెడ్డిలకు కమలానగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలుపుతూ ప్రతినిధులు శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు రాఘవరెడ్డి,పెంటయ్య గౌడ్, స్థానికులు పాల్గొన్నారు.

– కాప్రా, ఏప్రిల్ 4

రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకోండి

మేడ్చల్ కలెక్టరేట్,ఏప్రిల్ 4:ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తుకు ఈనెల 14వ తేదీ వరకు పొడిగించిదని జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్లతో రాజీవ్ యువ వికాసం పథకంపై టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ..ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన రాజీవ్ యువ వికాసం పథకం ప్రకటించడమైనదని, సెలవు దినాలలో కేంద్రాలు పనిచేస్తాయన్నారు. ఆన్‌లైన్‌లోనే కాకుండా ఆఫ్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రజలు గమనించి దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టరు సూచించారు. మున్సిపల్, ఎంపీడీఓ కార్యాలయ స్థాయిలలో ప్రచారం చేసి అధిక సంఖ్యలో దరఖాస్తులు చేసుకునేల చర్యలు తీసుకోవాలని సూచించారు. 25శాతం సింగిల్ ఉమెన్, వితంతులకు, 5శాతం దివ్యాంగులకు కేటాస్తున్నామని,వారు దరఖాస్తు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన నేతలు





బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిధంగా నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తన కుటుంబసభ్యులతో శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్పొరేటర్ కుమార్తె సాహితీ పుట్టినరోజు సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్‌శేఖర్, కార్పొరేటర్ కుమారుడు సాయి దేవ్ పాల్గొన్నారు.

– బీఆర్ఎస్ పార్టీ రథోత్సవ మహాసభ నేపథ్యంలో ఎర్రబెల్లి నివాసంలో అధినేత కేసీఆర్ సమక్ష అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశానికి హాజరైన సందర్భంగా కేసీఆర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిశారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– ఉప్పల్/కాప్రా, ఏప్రిల్ 4

డ్రైనేజీ సమస్య పరిశీలన

గౌతంనగర్ డివిజన్‌లోని రైల్వే ట్రాక్ సమీపంలో నిరంతరం రోడ్డుపై పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ జలమండలి, జీహెచ్ఎంసీ, రైల్వే అధికారులను కోరారు. వెంటనే స్పందించి శుక్రవారం ఆయా శాఖల అధికారులతో కలిసి గౌతంనగర్ డివిజన్‌లోని రైల్వే సమీపంలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మేకల రాముయాదవ్, జలమండలి ఏఈ నవీన్, జీహెచ్ఎంసీ అధికారి దివ్వజ్యోతి పాల్గొన్నారు.

– నేరేడ్‌మెట్, ఏప్రిల్ 4

విద్యార్థులకు మార్గదర్శకులు టీచర్లు

విద్యార్థులకు మార్గదర్శకులు టీచర్లని మేడ్చల్ జిల్లా డీఈవో విజయకుమారి అన్నారు. శుక్రవారం అల్వాల్ లోని ప్రభుత్వ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి ఉద్యోగ విరమణ సందర్భంగా డీఈఓ సన్మానించారు. మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, బాలికల అసిస్టెంట్ హెచ్ఎం సునీత, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వసంత, రమేశ్, ఎంఈఓ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

– మల్కాజిగిరి, ఏప్రిల్ 4

నియోజకవర్గ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రామంతాపూర్/ఉప్పల్,ఏప్రిల్ 4:ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం రామంతాపూర్ ఇందిరానగర్‌లో రూ.85లక్ష నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావుతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ వన్నాల దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పసుల ప్రభాకర్‌రెడ్డి, సర్వబాబుయాదవ్, మంజుల సూరంశంకర్, శ్రీనివాస్ రెడ్డి, కైలాసపతి గౌడ్,రేపాక కుమారస్వామి, జహంగీర్, బీజేపీ నాయకులు ముత్తినేని జగదీశ్,నరసింహ పాల్గొన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పుష్పరాజ్ తండ్రి బాలరాజు కారు యాక్సిడెంట్‌కి గురికాగా.. బేగంపేట్ కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్‌లో చేర్పించారు. విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శుక్రవారం పరామర్శించారు.

హెచ్‌సీయూ భూములను అమ్మడం హేయమైన చర్య

మల్కాజిగిరి, ఏప్రిల్ 4: హెచ్‌సీయూ భూములను అమ్మడానికి ప్రభుత్వం ప్రయత్నించడం హేయమైన చర్య అని సీపీఎం మల్కాజిగిరి మండల కార్యదర్శి లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మల్కాజిగిరిలోని కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సెంట్రల్ యూనివర్సిటీలోని 400ఎకరాల భూమిని అమ్మడానికి చేస్తున్న ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. పోలీసు బలగాలను ప్రయోగించి విచక్షణా రహితంగా కొట్టించి పోలీస్‌స్టేషన్లో బంధించడాన్ని ఖండిస్తున్నామన్నారు.

ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి

ఘట్‌కేసర్, ఏప్రిల్ 4:ఘట్‌కేసర్ గురుకుల్ విద్యాలయ అభివృద్ధికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని గురుకుల్ పూర్వ విద్యార్థులు డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ పట్టణంలోని శిథిలావస్థకు చేరుకున్న గురుకుల్ విద్యాలయానికి పూర్వవైభవం కల్పించాలని ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ అబ్బాసాని యాదగిరి యాదవ్ చేపట్టిన ఉత్తరాల ఉద్యమంలో భాగంగా శుక్రవారం పూర్వవిద్యార్థి బండి శివకుమార్ గౌడ్ సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు స్పీడ్ పోస్టు ద్వారా ఉత్తరాలను పంపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. పూర్వ విద్యార్థులు వెంకటేశ్, ఇమ్ము, కేఫా, సాల శ్రీనివాస్ గౌడ్, శివరాత్రి సురేశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

ఘట్‌కేసర్ పట్టణంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం బస్సుయాత్రకు స్వాగతం పలికి మాట్లాడుతున్న మారం లక్ష్మారెడ్డి తదితరులు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 4: తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఉద్యమకారుల ఫోరం మేడ్చల్ జిల్లా చైర్మన్ మారం లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ పట్టణంలో తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్ల సాధనకై ఈనెల 21వ తేదీన నగరంలో నిర్వహించనున్న ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేసేందుకు నగరం నుంచి యాదాద్రి వరకు చేపట్టిన బస్సు యాత్రకు ఉద్యమకారుల ఫోరం చైర్మన్ మారం లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా స్వాగతం పలికారు. ఈనెల 21న నగరంలోని సీతాఫల్ మండి జీహెచ్ఎంసీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ప్లీనరీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్లీనరీలో ప్రతిఒక్క ఉద్యమకారుడు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బచ్చు నగేశ్‌గుప్తా, రేసు లక్ష్మారెడ్డి, డాక్టర్ ములుగురం జంగయ్య, కమలాకర్, బీఆర్ఎస్ సోషల్ మీడియా మేడ్చల్ జిల్లా సభ్యుడు ఎండీ సిరాజ్, బచ్చు ప్రమోద్ గుప్తా, పల్లె విజయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఖనిజ సంపదను కొల్లగొట్టడానికే.. ఆపరేషన్ కగార్

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

జవహర్‌నగర్, ఏప్రిల్ 4: ఖనిజ సంపదను కొల్లగొట్టడానికే ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ గిరిజనులపై హత్యాకాండను మోపుతూ వందలాది మందిని పొట్టనపెట్టడం దుర్మార్గమని, వెంటనే ఆపరేషన్ కగార్‌ను విరమించుకోవాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.శివబాబు డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని కోరుతూ ఈ నెల 8న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని అంబేద్కర్ ప్రధాన చౌరస్తాలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.శివబాబు ఆధ్వర్యంలో శుక్రవారం పోస్టర్‌ను ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఉపేందర్, రాములు, యాదయ్య, రేణుక, వెంకటయ్య, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

కారిడార్ పనుల జాప్యంపై ఉప్పల్ వాసుల నిరసన

ఫ్లైఓవర్ పనులు త్వరగా చేయాలని ర్యాలీగా వస్తున్న ఉప్పల్ అఖిలపక్ష నేతలు

ఉప్పల్, ఏప్రిల్ 4 : ఉప్పల్–నారపల్లి ఎలివేటెడ్ కారిడార్(ఫ్లైఓవర్) నిర్మాణ పనులు నత్త నడకన జరగడాన్ని నిరసిస్తూ ఉప్పల్ అఖిలపక్షం ఆధ్వర్యంలో పార్టీలకతీతంగా అఖిలపక్ష నాయకులు, వర్తక సంఘం ప్రతినిధులు శుక్రవారం నిరసన తెలిపారు. ఉప్పల్ లక్ష్మారెడ్డి కాలనీ నుంచి ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా చేరుకొని మా సమస్యను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కారం చూపాలని రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు మేకల మధుసూదన్ రెడ్డి, మేకల శివారెడ్డి, మేకల హనుమంత్ రెడ్డి, కంది కంటి అశోక్‌కుమార్‌గౌడ్, బజారు జగన్నాథ్ గౌడ్, గోనె అర్జున్ రెడ్డి, సల్ల రాజి రెడ్డి, సల్ల వీరారెడ్డి, అరటికాయల భాస్కర్ ముదిరాజ్, నేర్దం భాస్కర్ గౌడ్, జెల్లి మోహన్, మహంకాళి లక్ష్మణ్ ముదిరాజ్, దాస్ గౌడ్, జి శ్రీనివాస్ శర్మ, మహంకాళి నరసింహ ముదిరాజ్, బిక్కుమల్ల రమేశ్ గుప్తా, బిక్కుమల్ల సుధాకర్ గుప్తా, నాగరి గారి వెంకటయ్య, మేకల భాస్కర్ రెడ్డి, మేకల సంతోష్ రెడ్డి, మేకల దయాసాగర్ రెడ్డి, గిరి రామకృష్ణ, శ్రీనాథ్ రెడ్డి, అంజి రెడ్డి, లింగారెడ్డి, సుధాకర్ రెడ్డి, జీవన్ రెడ్డి, కల్లూరు వేణు, రామయ్య, పూడూరి జితేందర్ రెడ్డి, అన్న బాలకృష్ణ, చింతల నరసింహారెడ్డి, వేముల సంతోష్‌రెడ్డి, బింగి భరత్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సబిత ఎర్రవెల్లికి వెళ్తూ..మధ్యలో కాసేపు..

శామీర్‌పేట సహకార సంఘ కార్యాలయాన్ని శుక్రవారం మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి సందర్శించారు. శామీర్‌పేట మీదుగా ఎర్రవల్లికి వెళ్తున్న ఆమె మార్గమధ్యలో ఉన్న శామీర్‌పేట వ్యవసాయ సహకార సంఘ కార్యాలయానికి విచ్చేవారు. సహకార సంఘ పనితీరును తెలుసుకొని, చైర్మన్, డైరెక్టర్లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమెకు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మహేశ్ రెడ్డి, ఆనంద్, రోహిత్ రెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, సహకార సంఘం వైస్ చైర్మన్ ఐలయ్య యాదవ్, డైరెక్టర్లు భూంరెడ్డి, నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోహన్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– శామీర్‌పేట, ఏప్రిల్ 4

నిరుపేద కుటుంబానికి ఆర్థిక చేయూత

బోడుప్పల్, ఏప్రిల్ 4: నిరుపేదలకు, అనాథలకు ఆర్థిక సాయం చేయడం సంతోషంగా ఉందని రాపోలు సుగుణమ్మ శేషాద్రి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పరంధాములు, సుదర్శన్, వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం బుద్ధనగర్‌లో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, సీఐ జానీ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థిని మౌనికకు రూ.25వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అదేవిధంగా అనారోగ్యానికి గురైన మౌనిక తండ్రి ఆమోజీకి అండగా ఉంటామని ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. ఆరోగ్యం, విద్య అవసరాలను గుర్తించి నిరుపేదలకు అండగా ఉంటున్న ట్రస్టు నిర్వాకులను పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్కా వెంకరెడ్డి, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ మార్బుల్ జానీ, స్థానిక మాజీ కార్పొరేటర్ యుగంధర్ రెడ్డి ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో బుద్ధ నగర్ సీనియర్ సిటిజన్స్, కాలనీవాసులు పాల్గొన్నారు.

జీతాలు తగ్గిస్తామంటే ఎట్లా బతకాలి?

జవహర్‌నగర్ మున్సిపల్ కార్మికులు

జవహర్‌నగర్, ఏప్రిల్ 4:గత బీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు జీతాలు పెంచితే... కాంగ్రెస్ ప్రభుత్వం జీతాలు తగ్గించి ఇస్తామని ఆదేశాలు జారీ చేయడం దుర్మార్గమని, తక్కువ జీతాలతోనే కాలం వెళ్లదీస్తుంటే... తగ్గిస్తామంటే ఎట్లా బతకాలని జవహర్‌నగర్ మున్సిపల్ కార్మికులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని కార్పొరేషన్ మున్సిపల్ కార్మికుల జీతాలు తగ్గించొద్దని కోరుతూ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి శివబాబు ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయంలో మేనేజర్ నగేశ్‌కు శుక్రవారం కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులను న్యాయం చేస్తుందనుకుంటే మా పొట్ట కొట్టాలని చూడటం ప్రభుత్వానికి తగదని, కనీస వేతన చట్టం ప్రకారం.. రూ.26వేలు అందజేయాలన్నారు. కార్మికుల జీతాలు తగ్గిస్తామనే ఆలోచనను విరమించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులకు 8గంటల పని చేయించాలని, గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్ ఇవ్వాలన్నారు. అనంతరం మేనేజర్ నగేశ్‌కు కార్మికులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యాదయ్య, రాములు, ఉపేందర్, రేణుక, వెంకటమ్మ, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

అవమానాన్ని భరించలేక..బాలిక బలవన్మరణం

జవహర్‌నగర్, ఏప్రిల్ 4: ఫోన్‌లో తరచూ మాట్లాడుతుందనే అపరాధ భావనను భరించలేక ఓ బాలిక బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గిరిప్రసాద్‌నగర్‌కాలనీలో చోటుచేసుకున్నది.ఎస్‌హెచ్‌వో సైదయ్య తెలిపిన ప్రకారం... జవహర్‌నగర్ కార్పొరేషన్ గిరిప్రసాద్‌నగర్‌కాలనీలో ఇటుకాల రేణుక, భర్త హరి, కుమార్తె జాశ్విని, కుమారుడితో కలిసి నివసిస్తున్నారు. హరి రామగుండంలో విద్యుత్ సంస్థలో రోజువారీ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. కుమార్తె జాశ్విని(13) ఓ ప్రైవేటు పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నది. తల్లి రేణుకా పనికి వెళ్లిన సమయంలో జాశ్విని సోషల్‌మీడియాలో స్నేహితులతో తరచూగా ఛాటింగ్ చేస్తుండేది. ఇటీవల కుటుంబసభ్యులు, చుట్టుప్రక్కవారు మందలించి జాశ్వినికి ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడొద్దని చెప్పారు. దీంతో జాశ్విని 4 రోజుల నుంచి పాఠశాలకు వెళ్లకుండా ఇంటివద్దనే ఉంటుంది. మనస్థాపం చెందిన జాశ్విని ఈ నెల 3వ తేదీన ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. పని వెళ్లొచ్చిన మృతురాలి తల్లి వెంటనే చుట్టు పక్కలవారి సాయంతో దవాఖానకు తరలించగా.. అప్పటికే మృతి చెందింది. జాశ్విని ఫోన్‌ను చూడగా వీరా అనే వ్యక్తితో ఛాటింగ్ చేసినట్టు గమనించారు. పక్కనే ఉన్న నోట్ బుక్‌ను పరిశీలించగా 'బోస్ ఐలవ్ యూ, వీరా ఐలవ్ యూ.. మిస్‌యూ... గుడ్ డే రామ్ గుడ్ బై' అంటూ రాసి కనిపించింది. మానసిక వేధింపులతోనే కుమార్తె ఆత్మహత్య చేసుకుని ఉంటుందని కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయాలి

మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 4:నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మి చెక్కులను వెంటనే అందించాలని కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. మాజీ కౌన్సిలర్లు బిజ్జా శ్రీనివాస్ గౌడ్, బుద్దవరం లక్ష్మీ, నాగారం మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు కొండబోయిన నాగరాజ్ యాదవ్ పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై 5%రాయితీ

బోడుప్పల్: 2025–2026 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను చెల్లింపుపై 5శాతం రాయితీ కల్పిస్తున్నట్లు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శైలజ తెలిపారు. ఏప్రిల్ 30వ తేదీ లోపు చెల్లించిన వారికి ఈ రాయితీ వర్తిస్తుందని, నగర పరిధిలోని గృహ యజమానులను ప్రోత్సహించడానికి ఈ రాయితీ కల్పిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఎర్లీబర్డ్‌ను సద్వినియోగం చేసుకోండి

కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్

కాప్రా, ఏప్రిల్ 4: 2025–2026 సంవత్సరానికి సంబంధించి ముందస్తు ఆస్తి పన్ను చెల్లించి ఎర్లీబర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి.జగన్ కోరారు. శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గృహస్తులు 2025–2026కి సంబంధించి ఆస్తిపన్ను 5శాతం రాయితీతో ముందస్తుగా చెల్లించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని, దీన్ని సద్వినియోగం చేసుకొని తమ గృహాలకు, వాణిజ్య ప్రాంతాలకు సంబంధించిన ఆస్తిపన్నులను ముందస్తుగా చెల్లించాలని డీసీ కోరారు. ఈనెల 1వ తేదీ నుంచి ఎర్లీబర్డ్ పథకం ప్రారంభమైందని, ఈనెల 30 వరకు మాత్రమే ముందస్తు పన్ను చెల్లించే అవకాశం ఉంటుందని డీసీ తెలిపారు.

ఎర్లీబర్డ్ పథకానికి స్పందన...

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎర్లీ బర్డ్ పథకానికి కాప్రా సర్కిల్లో స్పందన కన్పిస్తున్నది. ఈనెల 1న ప్రారంభమైన ఈ పథకం శుక్రవారం వరకు(4రోజుల్లోనే) రూ.1.98 కోట్లు (ఎర్లీ బర్డ్)ముందస్తు ఆస్తి పన్ను చెల్లింపులు జరిగినట్టు అధికారులు తెలిపారు. గత ఏడాది(2024–2025) ఏప్రిల్ నెలలో ఎర్లీ బర్డ్ పథకం కింద రూ.27.79కోట్లు వసూలైందని, ఈ ఏడాది (2025–2026) ఎర్లీ బర్డ్ పథకం టార్గెట్ రూ.34 కోట్లుగా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు నిర్దేశించినట్లు, దీన్ని తప్పక సాధిస్తామని సర్కిల్ డీసీ ధీమా వ్యక్తం చేశారు.

పోచారం మున్సిపాలిటీలో 66.29 శాతం

పోచారం:పోచారం మున్సిపాలిటీలో 66.29 శాతం పన్నులు వసూలైనట్లు కమిషనర్ వీరారెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలో మొత్తం రూ.17కోట్ల 38లక్షలు రావాల్సి ఉండగా, గత మార్చి 31వరకు రూ.11 కోట్ల, 52లక్షలు వసూలైనట్లు కమిషనర్ వివరించారు. మిగతా రూ.5కోట్ల 86లక్షలు వసూలు కావాల్సి ఉందని ఆయన వివరించారు. పన్నుల వసూళ్లలో మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది తీవ్రంగా కృషి చేశారన్నారు.

గుండెపోటుతో విద్యార్థి మృతి

వినయ్(ఫైల్)

మేడ్చల్, ఏప్రిల్ 4 : గుండెపోటుతో ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. తోటి విద్యార్థుల కథనం ప్రకారం..ఖమ్మం జిల్లాకు చెందిన వినయ్ సీఎంఆర్ కళాశాలలో బీటెక్ 4వ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం తోటి విద్యార్థులతో కలిసి కళాశాల మైదానంలో క్రికెట్ ఆడుతున్నాడు. మైదానంలో ఫీల్డింగ్‌లో ఉండగా.. గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలాడు. గమనించిన తోటి విద్యార్థులు వెంటనే అతడిని హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. స్నేహితుడు కళ్ల ముందే కుప్పకూలిపోయి మృతి చెందడంతో విద్యార్థులు తీవ్ర ఆవేదనకు గురై కన్నీరు మున్నీరయ్యారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

మల్కాజిగిరి, ఏప్రిల్ 4 : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం... ఐఎన్‌నగర్‌కు చెందిన నర్సింహులు ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటాడు. శుక్రవారం ఇంట్లో జరిగిన విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో సామగ్రి కాలిపోయింది. ఈప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీధి కుక్క దాడి.. ముగ్గురికి గాయాలు

మేడ్చల్ రూరల్, ఏప్రిల్ 4: వీధి కుక్క దాడి చేసిన ఘటనలో ముగ్గురికి గాయాలైన సంఘటన గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలో చోటుచేసుకున్నది. మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీలోని గౌడవెల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం రైల్వేస్టేషన్ వద్ద నడుచుకుంటూ వెళ్తున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమణారెడ్డిపై వెనుక నుంచి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది.